క్లుప్తంగా

స్నేహపూర్వక సాయం


చలమయ్యకు సాయం చేస్తున్న స్నేహితులు

జమ్మలమడుగు: వారంతా ప్రాణ స్నేహితులు.. చిన్నప్పుడు కలిసి చదువుకున్నారు. పెద్దయ్యాక తమ మైత్రిని మరువ లేదు. చిన్ననాటి స్నేహితుడికి ఆపద వస్తే తామున్నామంటూ అండగా నిలిచారు. ఎర్రగుంట్ల మండలం చిలంకూరు గ్రామానికి చెందిన తలారి చలమయ్య ఇంట్లో విద్యుత్ సర్క్యూట్ వలన వస్తువులు, నగదు పూర్తిగా కాలిపోయింది. దీంతో బాల్య స్నేహితులైన గురప్ప, గురుశేఖర్, ప్రవీణ్, అనిల్, లక్ష్మీప్రసన్న, సుదర్శన్ కలిసి చలమయ్య కుటుంబానికి రూ. 40 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా స్నేహితులు మాట్లాడుతూ తమతోపాటు చదువుకున్న చలమయ్య ఇంట్లో వస్తువులు, నగదు పూర్తిగా కాలిపోయిన విషయం తెలియడంతో సాయం అందించామని తెలిపారు.

ప్రజా సమస్యలపై పోరాటం


మాట్లాడుతున్న సీపీఐ ఏరియా కార్యదర్శి వెంకటరాములు తదితరులు

వేంపల్లి : ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతామని సీపీఐ పులివెందుల ఏరియా కార్యదర్శి బి.వెంకట రాములు తెలిపారు.
వేంపల్లి ఎస్టీయూ మీటింగ్ హాల్లో సీపీఐ పులివెందుల ఏరియా ఏడవ మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఏరియా కార్యదర్శిగా బి.వెంకట రాములు, సహాయ కార్యదర్శులుగా కే. బ్రహ్మం, అంజనప్ప ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి ఎన్నుకున్న పార్టీ సభ్యులకు జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తామని తెలిపారు.

జూదరుల అరెస్టు

చక్రాయపేట: చక్రాయపేటలో పేకాట ఆడుతున్న 11మందిని అరెస్టు చేసినట్లు ఆర్కే వ్యాలీ ఎస్ఐ ఉలసయ్య తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు ఎస్ఐ రంగారావు, ఏఎస్ఐ రాజశేఖరరెడ్డి సిబ్బందితో కలిసి దాడి చేసి 11మందిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వారి వద్ద నుంచి రు.1,45,100 నగదు, 2 కార్లు, 4 బైక్‌లు, 11సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

సమాజ సేవలో భాగస్వాములవ్వాలి


మాట్లాడుతున్న మానవతా సంస్థ మాజీ అధ్యక్షుడు నరసింహారెడ్డి

జమ్మలమడుగు రూరల్: సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మానవతా సేవా సంస్థ మాజీ అధ్యక్షుడు బీటీ నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని రిపబ్లిక్ క్లబ్‌లో మానవతా సేవా సంస్థ నూతన కార్యవర్గాన్ని ఎన్నికున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. మృతదేహాలను తీసుకెళ్లేందుకు శాంతిరథంన, బాడీ ఫ్రీజర్, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు పి. రామచంద్రారెడ్డి, కడప రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు రమణారెడ్డి, కమిటీ సభ్యులు గోనా పురుషోత్తంరెడ్డి, మాధవ గోపాల్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, ఆనంద్ బాబు, శివ గణపతి బేపారి మహమ్మద్ రఫీ, మజహర్ అలీ, సుధాకర్ గుప్తా, రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశిష్ట సేవలు అందించిన వారికి సన్మానించారు.

తారస్థాయికి చేరిన కక్షసాధింపు రాజకీయాలు

ప్రొద్దుటూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కక్ష సాధింపు రాజకీయాలు తారస్థాయికి చేరాయని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు సీఎం.దావూద్ అన్నారు. విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉద్యోగులను బెదిరించి, బ్లాక్‌మెయిల్ చేసి స్టేట్‌మెంట్లు తీసుకుని మద్యం అక్రమ కేసులో ఎంపీ మిథున్ రెడ్డిని ఇరికించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. చంద్రబాబు రాజకీయ జీవితమంతా కుట్రలతో సాగుతోందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తుండటంతోనే వైఎస్సార్‌సీపీ కీలక నేతలపై కేసులను పెట్టి అరెస్టు చేస్తున్నారని మండిపడ్డారు. 2014–19లో చంద్రబాబు, ఆయన ప్రభుత్వంలోని మంత్రులు, సన్నిహితులపై దాదాపు 13 అవినీతి కేసులున్నాయని, అందులో మద్యం కుంభ కోణం కేసు కీలకమైందన్నారు. 2014–19 మధ్య లిక్కర్ స్కాంలో చంద్రబాబు అడ్డంగా దొరికిపోయారని, అలాంటి చంద్రబాబు ఇప్పుడు అధికారంలోకి రాగానే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కీలకంగా పనిచేసిన వారిపై కక్ష సాధింపుతో ఎదురు కేసులు పెట్టిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఒక్క బెల్ట్ షాపు లేదని, ప్రభుత్వమే పారదర్శకంగా మద్యం దుకాణాలు నిర్వహించిందన్నారు. కానీ నేడు గ్రామాల్లో ఎక్కడ చూసినా బెల్ట్‌షాపులు దర్శనిమస్తున్నాయని తెలిపారు.ఎంపీ మిథున్‌రెడ్డి వైఎస్ జగన్‌కు సన్నిహితంగా ఉంటారని, అందుకే ఆయనను అరెస్ట్ చేశారన్నారు.

వైభవంగా ఆడికృత్తిక మహోత్సవం


వల్లీదేవసేన, సుబ్రహ్మణ్యస్వామిల మూలవిరాట్


కావడి పూజ చేస్తున్న భక్తులు

- ఘనంగా స్వామివారి కల్యాణం
- భారీగా తరలివచ్చిన భక్తులు

కమలాపురం: మండలంలోని రామాపురంలో వెలసిన మహాలక్ష్మీ సమేత మోక్ష నారాయణ స్వామి ఆలయంలో కొలువైన వల్లీ దేవసేన, సుబ్రహ్మణ్య స్వామికి ఆదివారం ఆడికృత్తిక మహోత్సవం వైభవంగా నిర్వహించారు. వల్లీదేవసేన, సుబ్రహ్మణ్య స్వామికి నిత్య కల్యాణం నిర్వహించడం ఈ ఆలయ విశిష్టత. అందువల్ల జిల్లా నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి సైతం భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామి షణ్ముఖుడిగా రెండు కంఠాలు కలసి ఉండి ద్వికంధురుడిగా వెలసి ఉండటంతో ఈ రోజు స్వామి వారిని పూజించడం కోసం భక్తులు తరలివచ్చారు. కాగా ఉదయం నాగబంధ హోమం, కాలసర్ప దోష నివృత్తి హోమం, సుబ్రహ్మణ్య స్వామి హోమంతో పాటు అనేక రకాల పూజలు, శత అష్టోత్తర కలశాభిషేకం, పంచామృతాభిషేకం నిర్వహించారు. ఉదయం మాడ వీధులలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి కావడి ఉత్సవం ఆలయ ప్రధాన సేవకుడు సాయినాథ శర్మ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అలాగే మయూర వాహనంపై వల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారు ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు అన్ని రకాల ఏర్పాట్లు చేయడంతో పాటు అన్న తీర్థ ప్రసాదాలు ఏర్పాటు చేశారు. ఆలయ అర్చకులు పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు.

గడప దాటితే భయం..భయం

- రోజురోజుకు పెరుగుతున్న కుక్కలు
- బయటకు రావాలంటే జంకుతున్న ప్రజలు



వీధుల్లో తిరుగుతున్న కుక్కలు

వేంపల్లె : వేంపల్లెలో వీధి కుక్కల బెడద అధికమైంది. కుక్కలు గుంపులు, గుంపులుగా స్వైరవిహారం చేస్తూ చిన్నా పెద్ద అని తేడా లేకుండా దాడి చేస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. దీంతో రోడ్లమీద ప్రయాణించాలంటేనే ప్రజలు భయాభ్రాంతులకు గురవుతున్నారు. వేంపల్లెలోని బిడ్డాల మిట్ట, శ్రీరాంనగర్, గరుగువీధి, యూనియన్ బ్యాంకు ప్రాంతాలతో పాటు ఆయా ప్రాంతాల్లో కుక్కలు విచ్చలవిడిగా రోడ్డుపై తిరుగుతున్నాయి. ఆయా వార్డుల్లో కుక్కల బెడద ఎక్కువ కావడంతో ప్రజలు రోడ్ల వెంట ప్రయాణించేందుకు నానా కష్టాలు పడుతున్నారు. ఈ ప్రాంతాల్లో వాహనదారులు పదుల సంఖ్యలో గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందిన సందర్భాలున్నాయి. కుక్కల బెడద రోజురోజుకు ఎక్కువైంది. మహిళలు, చిన్నారులు, వృద్ధులు ఒంటరిగా వీధుల్లోకి రావాలంటేనే జంకుతున్నారు. కుక్కల బెడదతో బయటికి రావాలంటేనే స్థానికులు వణికిపోతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు కుక్కల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్లు రోత.. ప్రజలకు వెత


బోడేద్దులపల్లెలో అధ్వానంగా ఉన్న రహదారి

చింతకొమ్మదిన్నె : కూటమి ప్రభుత్వం రహదారులను గురించి పట్టించుకోలేదు. గ్రామాల్లో సైడు కాలువల ఊసే లేకుండా పోయింది. దీంతో పల్లెముంగిళ్లలో బురదదారులు వెక్కిరిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు మరీ అధ్వానంగా తయారయ్యాయి. అడుగుతీసి అడుగువేయలేని పరిస్థితి నెలకొంది. మండలంలోని ఇప్పపెంట పంచాయతీ బోడేద్దులపల్లె గ్రామంలోని మీదుగా వెళ్లే కడప ఎర్రముక్కపల్లె – పవర్ గ్రిడ్ ప్రధాన రహదారి మోకాళ్ల లోతు గుంతలు, నీళ్లతో బురదమయంగా మారింది. ఈ రహదారిపై కడప నగరంలోని ఎర్రముక్కపల్లె నుంచి రాయచోటి హైవే పైకి పవర్ గ్రిడ్ వద్ద నేరుగా కలుస్తుంది. నిత్యం వందలాది వాహనాలు ఈ రహదారిపై గుంతల్లో నుంచే ప్రయాణిస్తుంటాయి. స్థానిక అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. మురుగు నీరు నిలువడంతో దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేసి స్థానికులకు, ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

‘మానవతా’ సేవలు ప్రశంసనీయం


దాతను సత్కరిస్తున్న మానవత సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి తదితరులు

వేంపల్లె : పేదలకు అండగా నిలిచేందుకు చేపడుతున్న మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సేవలు ప్రశంసనీయమని రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లె పట్టణంలో మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం, రక్తదానం శిబిరాన్ని ఏర్పాటు చేశామని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ శాశ్వత చైర్మన్ అధ్యక్షులు చక్రపాణి రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ యోగీశ్వర బాబు తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో తిరుపతికి చెందిన రమాదేవి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సిబ్బంది దాదాపు 300 మందికి వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. రక్తదానం చేయడం ద్వారా ఇతరుల ప్రాణాలను కాపాడే వారు అవుతారని తెలిపారు. మరిన్ని మంచి సేవా కార్యక్రమాలను మానవతా సేవా సంస్థ నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో మానవత జిల్లా సంయుక్త కార్యదర్శి కావలి కృష్ణతేజ, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్ రెడ్డి ,మాజీ జెడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ ఎస్ఎఫ్ బాషా, మానవత సంస్థ మాజీ అధ్యక్షుడు మీగడ రామమునిరెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకం కందిపప్పు

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఐసీడీఎస్ అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కు కావడంతోనే అంగన్‌వాడీ కేంద్రాలకు నాసిరకం కందిపప్పు అందుతోందని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కేసీ.బాదుల్లా అన్నారు. నగరంలోని హోచిమిన్ భవన్‌లో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ బద్వేల్ తదితర ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న కందిపప్పు బూజు పట్టిందన్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్తే ప్రభుత్వం ఇచ్చిన పప్పు అందజేశామని బుకాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీల్లో ముందుగానే వేలిముద్ర వేయించుకుని రెండు, మూడు రోజుల తర్వాత సరకులు సరఫరా చేస్తుండడంతో గుర్తించలేకపోతున్నారన్నారు. కలెక్టర్ స్పందించి ఆయా కేంద్రాలకు అందించే సరకుల్లో నాణ్యత ఉండేలా చూడాలన్నారు.

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం

జమ్మలమడుగు: రాష్ట్రంలో అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం అమలు కావడం లేదని, రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలవుతోందని వైఎస్సార్ సీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి లక్షుమయ్య పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఆయన కార్యాలయంలో మాట్లాడుతూ రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిని లిక్కర్ స్కాంలో అరెస్టు చేయడం రాష్ట్ర ప్రభుత్వ కక్షసాధింపు చర్యలో భాగమే అన్నారు. లిక్కర్ కేసులో సంబంధం లేకున్నా మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై ఉన్న కోపంతోనే ఎంపీని అరెస్టు చేయించారని తెలిపారు. రాష్ట్రంలో మహిళలపై ఆత్యాచారాలు, రైతుల ఆత్మహత్యలు జరుగుతున్నా వాటిపై స్పందించకుండ వైఎస్సార్‌సీపీ నాయకులపై అక్రమ కేసులు, అరెస్టులు చేయడం టీడీపీ నాయకులు పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. గండికోటలో మైనర్ బాలిక హత్య జరిగి ఐదు రోజులు దాటుతున్న ఇంతవరకు నిందితులకు పట్టుకోలేకపోయారని విమర్శించారు. కూటమి నాయకుల కక్ష సాధింపు చర్యలను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో ప్రజలు బుద్ధిచెబుతారని హెచ్చరించారు.

ఆపరేటర్‌పై రైతుల ఫిర్యాదు

పులివెందుల రూరల్: నియోజకవర్గంలోని లింగాల మండలం తాతిరెడ్డి పల్లె గ్రామంలోని సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఆపరేటర్ చైతన్యకుమార్‌రెడ్డి పనితీరుపై స్థానిక రైతులు శివకృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, నారాయణరెడ్డి, శంకరరెడ్డి, నాగార్జునరెడ్డి, సూర్య ప్రతాప్‌రెడ్డితో పాటు మరో 30 మంది పులివెందులలోని విద్యుత్ కార్యాలయంలోని ఏడీ గురుమోహన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొంతకాలంగా ఆపరేటర్ పనితీరు సరిగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అధికారులు స్పందించి ఆపరేటర్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై ఏడీ గురుమోహన్‌రెడ్డిని వివరణ కోరగా ఆపరేటర్ పనితీరు సరిగా లేదని రైతులు వినతి పత్రం ఇచ్చారని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: కడప రామాంజనేయపురంలోని ఆంధ్ర ప్రదేశ్ గురుకుల పాఠశాల(మైనారిటీ బాలురు)లో మిగిలిన సీట్లకు మైనార్టీ విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రామచంద్ర తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 5, 6, 7వ తరతులలో మిగిలిన సీట్లకు ఎలాంటి రాత పరీక్ష లేకుండా నేరుగా అడ్మిషన్ పొందవచ్చని ఆయన తెలిపారు. తగిన ధ్రువపత్రాలతో పాఠశాలను సందర్శించి అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు.

ఆత్మరక్షణకు తైక్వాండో దోహదం

రాజంపేట టౌన్ : తైక్వాండో ఆత్మరక్షణకు ఎంతగానో దోహదపడుతుందని తైక్వాండో అకాడమీ మాస్టర్ పిచ్చయ్య తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం తైక్వాండో క్రీడాకారులకు బెల్ట్ ఉత్తీర్ణత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిచ్చయ్య మాట్లాడుతూ తైక్వాండో ఆత్మరక్షణకు ఉపయోగపడటమే కాక శరీర దృఢత్వం, మానసికోల్లాసానికి దోహదపడుతుందని తెలిపారు. క్రీడల్లో రాణిస్తే విద్య, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ సౌకర్యం కూడా ఉంటుందని తెలిపారు. ఇదిలావుంటే బ్లూబెల్ట్‌కు గౌతమ్, సాహితి, వెంకట్ దీపేష్‌లు ఉత్తీర్ణులయ్యారు.

కరుణించవా.. వరుణ దేవా


అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న మళ్లికార్జునపురం గ్రామ ప్రజలు

పులివెందుల రూరల్: వరుణ దేవా.. కరుణించవా అంటూ పులివెందుల ప్రాంతంలోని గ్రామీణ ప్రజలు వేడుకుంటున్నారు. ఆదివారం మండల పరిధిలోని ఎర్రబల్లె పంచాయితీ పరిధిలోని మళ్లికార్జునపురం గ్రామంలో గ్రామస్తులు, ప్రజలు వానలు కురవాలని గ్రామంలో ఉన్న అమ్మవారికి బోనాలు సమర్పించారు. రోహిణి కార్తెకి ముందు తొలకరి వర్షాలు పలకరించి అన్నదాతలను మురిపించాయి. ముందుగా మురిపించిన మేఘాలు ఇప్పుడు ముఖం చాటేశాయి. మృగశిర పోయి అరుద్ర కార్తె వచ్చిన వానలు పడక పోవడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. తొలకరి కురిసిన వానలకు కొంత మంది రైతులు మొక్కజొన్న, పచ్చజొన్న సాగు చేశారు. ఆశించిన స్థాయిలో వానలు పడక పోవడంతో నాటిన విత్తనం కొంత మెరకే మొలకెత్తింది. దక్కులు సాగు కూడా అంతంత మాత్రమే సాగింది. ఈ నేపథ్యంలో మళ్లికార్జునపురం గ్రామ ప్రజలు వానలు కురవాలని అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చల్లంగా చూడమ్మ.. గంగమ్మ


అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

పులివెందుల రూరల్: చల్లంగా చూడమ్మ.. గంగమ్మ అంటూ భక్తులు అచ్చ వెళ్లి గంగమ్మతల్లిని వేడుకుంటున్నారు. కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంలా విరాజిల్లుతున్న మండల పరిధిలోని అచ్చ వెళ్లి గంగమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అమ్మవారిని దిర్శంచుకునేందుకు పులివెందుల ప్రాంతం నుంచి కాకుండా కడప, కర్నూల్, అనంతపురం, చిత్తూరు, రాయచోటి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. ఆలయ అర్చకులు కూడా భక్తులకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేస్తారు. ఆలయ అర్చకులు, నిర్వాహకులు భక్తులకు అన్ని సదుపాయలు ఏర్పాటు చేశారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


విశేష అలంకారంలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : కొత్తపేట గంగమ్మ తల్లి దర్శనానికి ఆదివారం భక్తులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. ఆదివారం ఆలయంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు, నగలు, గంధం, పసుపు, వేపాకు, ప్రత్యేక పూలమాలలతో విశేష అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి మొక్కుబడులను, ముడుపులను అమ్మవారికి చెల్లించుకున్నారు. మహిళా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. అలాగే గంగమ్మ ఆలయ సమీపంలోని వీరభద్రస్వామి, శివాలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు.

వేడుకగా బోనాలు


పూజలందుకుంటున్న అంకాలమ్మ

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని అంకాలమ్మ తల్లికి ఆదివారం భక్తులు బోనాలు సమర్పించి చల్లంగ చూడమ్మ అంకాలమ్మ తల్లి అని వేడుకున్నారు. ఆలయ అర్చకులు సురేష్, ఈశ్వర్ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి వెండి మకరతోరణంతో విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. భక్తులు అమ్మవారికి నిమ్మకాయల దండలు, బోనాలు సమర్పించి కాయకర్పూరాలు అందజేశారు. అలాగే అమ్మవారికి చీరలు, గాజులు, పువ్వులు అందజేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు బాగా కురిసి రైతులను, ప్రజలను ఆదుకోవాలని వేడుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ చైర్మన్ నాగేంద్రప్రసాద్ పర్యవేక్షించారు.

గంగమ్మకు బోనాలు


బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

పెండ్లిమర్రి: మండలంలోని పగడాలపల్లె, ద్వారకానగర్ గ్రామాలకు చెందిన భక్తులు వర్షం కురవాలని ఆదివారం గంగమ్మకు బోనాలు సమర్పించారు. మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో అమ్మవారికి భక్తిప్రపత్తులతో మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండి రైతన్నలు సుఖసంతోషాలతో ఉండాలని గంగమ్మకు పూజలు నిర్వహించారు.

ఎన్జీఓ నూతన కార్యవర్గం ఎంపిక


నూతన కార్యవర్గాన్ని సన్మానించిన ఎన్జీఓలు

జమ్మలమడుగు: ఎన్జీఓ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో సమావేశమైన నాయకులు జమ్మలమడుగు ప్రాంత నూతన కమిటీని ఎం.బాల పుల్లయ్య, శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఎన్జీఓ అధ్యక్షుడిగా పోరెడ్డి నారాయణరెడ్డి, కార్యదర్శిగా వీరారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అసోసియేట్ అధ్యక్షుడిగా డాక్టర్ రఫిక్‌పాషా, ఉపాధ్యక్షులుగా నాగేంద్రారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, రమాదేవి, శ్రీరాములు జాయింట్ సెక్రటరీలుగా గంగాధర్, మనోహర్, విజయమ్మ, ఆర్గనైజింగ్ సెక్రటరిగా పి.భారతి, కోశాధికారిగా ప్రవీణ కుమారిని ఎన్నుకున్నారు. అనంతరం ఎన్జీఓ నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించి వారిని ఘనంగా సన్మానించారు.

పది పరీక్ష పత్రాల మూల్యాంకనం నిధులను చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్: పదో తరగతి పరీక్ష పత్రాల మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులకు భత్యం నిధులను వెంటనే జమ చేయాలని ఎస్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. కడప ఎస్టీఎఫ్ కార్యాలయంలో జరిగిన జిల్లా నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2025 పది పరీక్షలకు చీఫ్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్, స్క్వాడ్ రెమ్యూనరేషన్ ఇంతవరకూ విడుదల చేయలేదన్నారు. బదిలీలలో భాగంగా రీ అపోస్ మెంట్‌లో వచ్చిన ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడీలు కేటాయించి జీతాలు చెల్లించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుపాకుల మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు బాలకృష్ణ, రవిశంకర్ పాల్గొన్నారు.

పంటతడి.. కంటతడి!

- అడుగంటిన భూగర్భజలాలు.. వట్టిపోయిన బోర్లు
- పంటలను కాపాడుకునేందుకు రైతుల ఆరాటం


బొప్పాయి మొక్కలకు బిందెలతో నీళ్లు పోస్తున్న రైతులు


డ్రిప్ పైపుకు ట్యాంకుర్‌తో నీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

ముద్దనూరు: వర్షం కురువకపోవడంతో రైతులు దిగులు చెందుతున్నారు. కంటికి కునుకు లేకుండా ఎదురుచూపులు చూస్తున్నారు. ఖరీఫ్‌లో విస్తారంగా కురిసి పంటలు పండితే కష్టాల నుంచి గట్టెక్క వచ్చని భావిస్తున్న రైతులు వర్షం జాడ లేకపోవడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వేసిన పంటలు పెరగకపోవడంతో పంటలను కాపాడుకునేందుకు నానాఅవస్థలు పడుతున్నారు. మండలంలోని ఆరవేటిపల్లె, దేనేపల్లె గ్రామాల్లో సాగులో ఉన్న చీనీ, అరటి, బొప్పాయితో పాటు కూరగాయల పంటలను కాపాడుకోవడంలో అష్టకష్టాలు పడుతున్నారు. అలాగే ఆరవేటిపల్లె, దేనేపల్లె గ్రామాల్లో సుమారు 800 ఎకరాల్లో అరటి, బొప్పాయి, చీనీ పంటలు సాగు చేశారు. అయితే భూగర్భజలాలు అడుగంటడం, వర్షాభావంతో రైతులు గ్రామానికి ప్రక్కనే ఉన్న గాలేరు–నగరి ప్రధాన కాలువ నుంచి నీటిని ట్యాంకర్లతో తెచ్చుకుని పంటలను బిందెలతో తడుపుతున్నారు. డ్రిప్ సౌకర్యం వున్న రైతులు ట్యాంకరులోని నీటిని డ్రిప్‌పైపుల ద్వారా సరఫరా చేసి పంటలను కాపాటుకుంటున్నారు. కొంతమంది రైతులు ఇప్పుడిప్పుడే నాటిన మొక్కలను సంరక్షించుకోవడానికి పాట్లు పడుతున్నారు.

సమస్యలు పరిష్కరించరూ!

- నేడు మండల సర్వసభ్య సమావేశం
- ప్రజల ఇబ్బందులనూ గమనించాలంటూ విన్నపాలు


కంకర తేలిన వెంకటాపురం రోడ్డు

కొండాపురం: మండలంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలన్నా.. పాత సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించాలన్నా ప్రజాప్రతినిధులు.. అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిందే. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరగనుంది. మండలంలో వివిధశాఖలకు చెందిన అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరుకానున్నారు. సర్వసభ్య సమావేశంలో ప్రజాసమస్యలకు ప్రాధాన్యమివ్వాలని మండల వాసులు కోరుతున్నారు. మండలంలో పేరుకుపోతున్న సమస్యలు.. తీసుకోవాల్సిన చర్యలపై కూలంకుషంగా చర్చిస్తే ప్రయోజనముంటుందని భావిస్తున్నారు. గత సమావేశంలో మండలంలోని వెంకయ్య కాలువ, టి.కోడూరు, బి.కొట్టాలపల్లె గ్రామ పంచాయతీలతో పాటు పలు గ్రామాల్లో చేతిపంపులు పని చేయలేదని సర్పంచ్‌లు అధికారుల దృష్టి తెచ్చారు. కానీ ఇప్పటివరకు సమస్యలను పరిష్కరించిన దాఖలాలు లేవు. అలాగే వెంకయ్య కాలువలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. చిన్నపాటి వర్షం కురిసినా.. డ్రైనేజీ కాలువలు పొంగిపోయి మురుగు నీరు రోడ్లపై పారుతున్నది. అదే గ్రామంలో రీ సర్వే చేసే సమయంలో రైతుల వెబ్‌ల్యాండ్ మ్యూట్‌లో పెట్టడం వల్ల వన్–బీ, అడంగల్ రాలేదని అధికారుల దృష్టికి రైతులు తెచ్చినా పట్టించుకోవడం లేదు. దొబ్బుడుపల్లె తిరుమలాయ పల్లె గ్రామాలల్లో తాగునీటి మోటర్‌కు విద్యుత్ ట్రాన్స్‌ఫారం లేదని మంజూరు చేయాలని గతంలో కోరారు. కొండాపురంలోని తాతయ్య గుట్ట వాసులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. వెంకటాపురం నుంచి బురుజుపల్లెకు రహదారిపై కంకర పరచి, తార వేయలేదు. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం జరిగే మండల సమావేశంలో గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.


వెంకయ్య కాలువలో పని చేయని చేతిపంపు